ఊరూరా సంక్రాంతి సంబరాలు

- పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు
- గ్రామ దేవతల ఉత్సవాలు
- యువత ఆధ్వర్యంలో పలు రకాల పోటీలు


నిడదవోలు మండలం పెండ్యాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో గాలి పటాలతో సందడి చేస్తున్న చిన్నారులు

నిడదవోలు రూరల్: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు పల్లెలు సందడిగా మారాయి. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో తెలుగు లోగిళ్లు సందడిని సంతరించుకున్నాయి. పిండి వంటలు, రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు బహుమతులు అందజేశారు. పెండ్యాల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని రామాలయం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. సమిశ్రగూడెం గరువు వీధిలోని సోమాలమ్మ వారి ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమాలమ్మను గ్రామ వీధుల్లో ఆదివారం ఊరేగించారు. సోమాలమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి, కాళీమాత నృత్య ప్రదర్శనలు, సినీ మ్యూజికల్ బ్యాండ్ పార్టీ, తీన్మార్, కోబ్రా డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. కోరుమామిడి, పురుషోత్తపల్లి గ్రామాల్లో కనుమ రోజు చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. పలు గ్రామాల్లో యువత ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కనుమ పండుగను పురస్కరించుకుని పశువులను శుభ్రంగా కడిగి, పసుకు, కుంకుమ బొట్లు పెట్టి, పూల దండలతో అలంకరించారు. గోపూజ చేశారు.

ఉండ్రాజవరం: మకర సంక్రాంతి, కనుమ పండగలను ఆది, సోమవారాల్లో మండల ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏ ఇల్లు చూసినా కూతుర్లు, అల్లుళ్లు బంధవులతో సందడి వాతావరణం కనిపించింది. ప్రతి ఇంటా పిండి వంటల ఘుమఘుమలాడాయి. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల కోలాహలం కన్పించింది. మహిళలు వేకువజామునే స్నానమాచరించి, ఇంట ముంగిట ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెట్టి గౌరీదేవి వ్రతాలను ఆచరించారు. ఇంటి ముంగింటకు వచ్చిన హరిదాసులు, గంగిరెద్దుల వారు శుభాశీస్సులు పలికారు. కుంటుబ సభ్యులు, బంధుమిత్రులు ఒక చోట చేరడంతో ఏడాదిగా జరిగిన విశేషాలను పంచుకుని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

తాళ్లపూడి: సంక్రాంతి పండగతో గ్రామాలకు కొత్త శోభ వచ్చింది. సోమవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల బంధువులు రావడంతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. పండగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పశువులకు పూజ చేశారు. గ్రామ దేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. ప్రజలు సంప్రదాయబద్ధంగా కనుమ పండుగను జరుపుకున్నారు. చిన్నారులు గాలి పటాలు ఎగరవేశారు. ఈ సందర్భంగా అన్నదేవరపేటలో అల్లూరి విక్రమాదిత్య యువ సేన ఆధ్వర్యంలో పలురకాల పోటీలు నిర్వహించారు.

నిడదవోలు: పట్టణంలోని 14వ వార్డు రాయిపేటలో ఆ వార్డు కౌన్సిలర్ బిర్రె పార్వతి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళలతో గొబ్బెమ్మల కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిర్రె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: సంక్రాంతి సందర్భంగా మీనానగరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చంద్రవరం, నందిగంపాడు, చిక్కాల తదితర గ్రామాల్లో జోరుగా కోడి పందేలు నిర్వహించారు.ఆఖరి రోజైన కనుమ నాడు గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. చిక్కాల ,చాగల్లు గ్రామదేవత అయిన పాటమ్మ వారి ఉత్సవాలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగరమ్మ ఆమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ ముప్పవరం, మార్కొండపాడు, చంద్రవరం గ్రామాల్లో గ్రామ దేవతలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతీ ప్రదానం


వేళ్లచింతలగూడెంలో క్రికెట్ టోర్నీ విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గోపాలపురం: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేళ్ల చింతలగూడెంలో ఘంటా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నీలో ప్రథమ స్థానం సాధించిన రాజానగరానికి చెందిన ప్రవీణ్ ఫాంటస్ జట్టుకు రూ లక్షా 50 వేల నగదు బహుమతి, మెమెంటో అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన దేవరపల్లి మండలం కురుకూరు జట్టుకు రూ.75 వేల నగదు బహుమతి మెమెంటో, తృతీయస్థానం సాధించిన జంగారెడ్డిగూడెం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో పాటు మెమెంటోను అందజేశారు. ముగ్గుల పోటీల్లో వేళ్ల చింతలగూడెం, పెద్దాపురం గ్రామాల మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి కాసు బంగారం, వెండి పళ్లెం, పట్టుచీరలు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఘంటా మధుకృష్ణ, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, దేవరపల్లి సీఐ ఏ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.రామకృష్ణ, కమిటీ సభ్యులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, క్రికెట్ కమిటీ కన్వీనర్ కొర్లపాటి రాజాచౌదరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల అందజేత

మండలంలోని పెద్దగూడెంలోని క్రికెట్ క్రీడాకారులకు ఆదివారం రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కుప్పల వరలక్ష్మి రూ. 40 వేల విలువైన క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల దోహదం చేస్తాయన్నారు. క్రీడా విభాగం డైరెక్టర్‌గా ఇప్పటి వరకూ రూ.లక్షా 50 వేల విలువైన క్రీడా సామగ్రిని యువకులకు అందజేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి శిరీష, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చియపాలెం గ్రామ సమస్యలు పరిష్కరిస్తా..

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దాతలు నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభం


బుచ్చియపాలెంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: బుచ్చియపాలెం గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలోని బుచ్చియపాలెంలో కాట్రు బ్రహ్మానందం జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రామకృష్ణ, మల్లిబాబు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామంలో విద్యుత్తు టౌన్ ఫీడర్ ఏర్పాటు చేసి విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తానన్నారు. మంచినీరు, రోడ్ల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కుగ్రామంలో దాతలు కాండ్రు రామకృష్ణ, మల్లిబాబు తమ తండ్రి జ్ఞాపకార్థం రూ.10 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతల్లో ఒకరైన రామకృష్ణ మాట్లాడుతూ పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంపీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడ మెట్లపై నుంచి జారి పడిన వ్యక్తి మృతి

కొవ్వూరు: మేడ మెట్లు ఎక్కుతుండగా జారి కింద పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక శ్రీరామ కాలనీకి చెందిన బొండాట వెంకటేశ్వరరావు (55) శనివారం రాత్రి ఏడు గంటలకు మేడ మెట్లు ఎక్కుతుండగా జారి పడ్డాడు. తలకు బలమైన గాయమైన ఆయనను కుటుంబ సభ్యులు తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు.హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు కేసు నమోదు చేశారు.

బుచ్చిరాజు కుటుంబానికి భట్టి విక్రమార్క పరామర్శ

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లిలో జుజ్జవరపు బుచ్చిరాజు ఇటీవల మృతి చెందారు. ఆయన వైఎస్సార్ సీపీ నాయకుడు, పురుషోత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరికి మేనమామ. ఈ నేపథ్యంలో బుచ్చిరాజు కుటుంబ సభ్యులను తెలంగాణలోని మధిర కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ సోమవారం రాత్రి పరామర్శించారు. బుచ్చిరాజు చిత్ర పటానికి భట్టి విక్రమార్క పూలమాల వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న శ్రీమన్నారాయణ యజ్ఞం

దేవరపల్లి: గౌరీపట్నం వద్ద గల శ్రీపర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీమన్నారాయణ యజ్ఞం, వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు యజ్ఞంలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుంటున్నారు. సోమవారం శ్రీమన్నారాయణుడికి సూర్యచంద్ర వాహన సేవ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఓం..నమో నారాయణ మంత్ర జపంతో శ్రీపర్వతం మార్మోగుతోంది. టీటీడీ నుంచి వచ్చిన వేదపండితులు శ్రీమన్నారాయణ యజ్ఞం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి యోగమిత్రులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. శ్రీవారిని బంగారు పుష్పాలతో అలంకరించారు.

నేడు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

శ్రీపర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకలు మంగళవారం సాయంత్రం వైభవంగా జరగనున్నాయి. వేడుకలకు ఆలయ కమిటీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్, ఆలయ ప్రధానార్చకుడు అవసరాల వెంకటరామానుజాయచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ కల్యాణ వేడుక జరుగుతుందని ప్రధానార్చకుడు తెలిపారు. స్వామివారి కల్యాణంతో మహోత్సవాలు ముగియనున్నాయి.

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావారం గ్రామంలో ముత్యాలమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల సీనియర్స్ విభాగంలో విజేతలైన కొమరి ప్రియాంక (ప్రథమ) 8 తులాల వెండి పట్టీలు, మీసాల అంజలి, బొబ్బిలి భాగ్యం (ద్వితీయ) మిక్సీ, హాట్‌బాక్స్, సూరవరపు లక్ష్మి, తణుకు లహరి (తృతీయ) నాన్ స్టిక్, లంచ్ బాక్స్ బహుమతులుగా అందజేశారు. ఇక జూనియర్స్ విభాగంలో గెద్దం దుర్గ (ప్రథమ) కరెంట్ కుక్కర్, తూము పద్మప్రణిత (ద్వితీయ) హాట్ వాటర్ జగ్, గిద్దా సిరి మహాలక్ష్మి(తృతీయ) లంచ్ బాక్స్‌లను బహుమతులుగా పాలంగి సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రెండు గిన్నెల లంచ్ బాక్సులను అందించారు.

55 మంది రైతులకు పంట రుణాలు

నిడదవోలు రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని శంకరాపురం సొసైటీ ఆధ్వర్యంలో 55 మంది రైతులకు రూ.48 లక్షల పంట రుణాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పి.ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై కేసుల నమోదు

తాళ్లపూడి: సంక్రాంతి సందర్భంగా తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. పందేల శిబిరాలపై సోమవారం సాయంత్రం దాడులు చేసి మూయించి వేసినట్టు తెలిపారు. మండలంలోని అన్నదేవరపేటలో గుండాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే తాళ్లపూడిలో మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు 13 మందిపై ఆరు కేసులు కేసు నమోదు చేశామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

గోపాలపురం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు గోపాలపురం ఎస్‌ఐ కె.రామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. గోపాలపురానికి చెందిన తానేటి బ్రహ్మయ్య (40) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాగే మండలంలోని జగన్నాథపురం వద్ద ఆటో బోల్తాపడి దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన గెద్దం శ్రీనివాసరావు(35) అనే వ్యక్తి మృతి చెందాడు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోట సత్తెమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు

నిడదవోలు రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆది, సోమవారాల్లో భక్తులు పోటెత్తారు. దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.95,335 ఆదాయం సమకూరింది. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం


నిడదవోలులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

నిడదవోలు: సంక్రాంతి కానుకగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు నిడదవోలు రైల్వేస్టేషన్‌లో వైఎస్సార్ సీపీ, బీజేపీ నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల నాయకులు ఆదివారం రాత్రి ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి నాడు సికింద్రాబాద్ నుంచి విశాఖకు బయలుదేరిన రైలు తొలిసారిగా నిడదవోలు రైల్వేస్టేషన్‌కు రావడంతో మంగళ వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. రైలుపై పూలవర్షం కురిపించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను తిలకించడానికి పట్టణ ప్రజలు భారీగా తరలి వచ్చారు. నిడదవోలు స్టేషన్‌కు ఆదివారం రాత్రి 7.01 గంటలకు ఈ ట్రైన్ వచ్చింది. రెండు నిమిషాల హాల్ట్ అనంతరం తిరిగి బయలు దేరింది. అధునాతన హంగులతో ఉన్న రైలును చూసి పట్టణ ప్రజలు మురిసిపోయారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకోవడానికి ఎగబడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్టేషన్ మేనేజర్ జి.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మద్దిపాటి ఫణీంద్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్కే వజీరుద్దీన్, బీజేపీ నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, సింహాద్రి సత్యనారాయణ, బండి సత్యనారాయణ, సుంకర నరసింహారావు, మోర్ల ప్రమోద్, షఫీ, వేదుల జనార్దన్, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులకు ప్రతిభా పురస్కారాలు

నల్లజర్ల: పేదరికంలో పుట్టి ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన మండలంలోని నలుగురికి మానవత సంస్థ మండల శాఖ సోమవారం రాత్రి ప్రతిభా పురస్కారాలు అందజేసింది. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకొని నేడు చార్టెడ్ అక్కౌండెంట్‌గా పనిచేస్తున్న గారపాటి గోపి, బీటెక్ చదివిన నాదెళ్ల గుణశేఖర్, డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాదెళ్ళ బుల్లిరాజు, గారపాటి లీలులకు ఒక్కొక్కరికి మెమోంటో, రూ.25 నగదు అందజేశారు. వారి తల్లిదండ్రులను కూడా సత్కరించారు. మానవత సంసథ మండలశాఖ అధ్యక్షుడు గుళ్ళపూడి వెంకటరత్నం, జిల్లా ఆద్యుడు రామిశెట్టి గంగాధరరావు, జిల్లా విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోడి పందేలు

- ఆది, సోమవారాల్లో గుండాటలు
- కొన్ని బరుల వద్ద కొట్లాట


దేవరపల్లి మండలం యాదవోలులో నిర్వహిస్తున్న కోడిపందెం

దేవరపల్లి: సంక్రాంతి మూడు రోజులూ సంప్రదాయబద్ధంగా పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. సోమవారం సాయంత్రంతో గోపాలపురం నియోజకవర్గంలో ఈ పందేలు ముగిశాయి. ఎస్సై కె. శ్రీహరిరావు ఆధ్వర్యంలో దేవరపల్లి మండలంలోని పందెం బరులను పోలీసులు తొలగించారు. మొదటి రోజు గుండాటకు పోలీసులు అనుమతించక పోవడంతో పందేల నిర్వాహకులు డీలా పడ్డారు. రెండో రోజు ఆదివారం మధ్యాహ్నం 11 గంటల నుంచి బరుల వద్ద భారీ ఎత్తున గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. దేవరపల్లి మండలం కురుకూరు బరిలో పందెగాళ్లు బాహాబాహీకి దిగారు. కుర్చీలతో కొట్టుకోవడంతో పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. దేవరపల్లి బరి వద్ద కూడా ఇద్దరు యువకులు కొట్టుకోవడంతో ఒక యువకుడు స్పృహ తప్పి పడిపోయాడు. మరో బరి వద్ద కోడి కత్తి తగిలి ఓ వ్యక్తి గాయపడ్డాడు.

కొవ్వూరు: పశివేదల, తోగుమ్మి, కుమారదేవం గ్రామాల్లో పది మంది కోడి పందేల రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం కొవ్వూరులో ఒక పందెం శిబిరం వద్ద వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఆ శిబిరాన్ని నిలుపుదల చేశారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, పెద్దేవం, గజ్జరం, వేగేశ్వరపురం, రావూరుపాడు తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు.

పెరవలి: భోగి రోజు కేవలం కోడి పందేలకు మాత్రమే అనుమతించిన పోలీసులు, ఆదివారం మధ్యాహ్నం నుంచి పేకాట, గుండాటల నిర్వహణకు అడ్డు చెప్పలేదు. మండలంలోని అజ్జరం, వెంకట్రాయపురం, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో కోడి పందేల బరులు వేశారు.

గోపాలపురం: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. కొని బరుల వద్ద గుండాలు, కోతాటలు కూడా జరిగాయి.

క్లుప్తంగా

హరిదాసు సతీష్‌కు సత్కారం


హరిదాసు సతీష్‌ను సత్కరిస్తున్న చీపురుగూడెం గ్రామస్తులు

నల్లజర్ల: ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు గ్రామంలో హరినామ సంకీర్తన దిగ్విజయంగా పూర్తి చేసిన తెలంగాణలోని ఖమ్మం జిల్లా రామానగరానికి చెందిన హరిదాసు భద్రాచలం సతీష్‌ను చీపురుగూడెం గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. పురాతన తుమ్మాలమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ తలంశెట్టి కోటీశ్వరరావు, చెల్లు హరిబాబు ఆధ్వర్యంలో హరిదాసు సతీష్‌ను పట్టు వస్త్రాలు, పూలమాలతో సత్కరించి రూ.15 వేల నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో తలంశెట్టి మాధవరావు, గాలింకి రాంబాబు, చిన వెంకట్రావు, మోహన, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సతీష్ వృత్తి రీత్యా బీఎస్ఎఫ్ జవాన్. కాగ ధనుర్మాసం నెల రోజుల పాటు ఉద్యోగానికి సెలవుపెట్టి తమ సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఉండ్రు విజయ్ మృతదేహం

నిడదవోలు: పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో మండలంలోని తిమ్మరాజుపాలేనికి చెందిన ఉండ్రు విజయ్ (21) అనే యువకుడు మృతి చెందాడు. స్వగ్రామం నుంచి నిడదవోలు పట్టణానికి మోటార్ సైకిల్‌పై బయలుదేరిన ఆ యువకుడ్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. కిందపడి తీవ్రంగా గాయపడిన విజయ్‌ను ఆటో డ్రైవర్ భీమడోలు శ్రీను తన ఆటోలో ముందుగా నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో రాజానగరంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడ వైద్యులు విజయ్‌ని పరీక్షించి, మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు ఉండ్రు విజయ్ ఇంటర్ చదివి రాజమహేంద్రవరంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. పండగ పూటా విజయ్ చనిపోవడంతో తిమ్మరాజుపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు విజయ్ సోదరుడు ఉండ్రు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పందెంకోడి దాడి.. యువకుడికి గాయాలు


గాయపడిన నరసింహమూర్తి

పెరవలి: కత్తి కట్టిన పందెపు కోడి దాడి చేయడంతో పందేలు చూడడానికి వచ్చిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెరవలి మండలం ఖండవల్లిలోని కోడి పందేల బరి వద్ద సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. అదే గ్రామస్తుడు తుమ్మూరి నరిసింహమూర్తి (25) ఈ దాడిలో గాయపడ్డాడు. రెండు కోళ్లు హోరాహోరీగా పోటీ పడుతుండగా బరిలో ముందు వరుసలో ఉన్న నరసింహమూర్తిని వెనుక ఉన్న వారు ముందుకు తోశారు. దాంతో అతడు పందెపు కోళ్ల మధ్యకు వచ్చేశాడు. అదే సమయంలో తీవ్రంగా పోరాడుతున్న కోళ్లలో ఒకటి అతడిపై దాడి చేసి కుడికాలి పిక్కను కత్తితో చీల్చేసింది. తీవ్రంగా గాయపడిన నరసింహామూర్తిని హుటాహుటిన తణుకులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు పెద్ద ఎత్తున బరి వద్దకు చేరుకుని ఆ బరిని మూసివేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com

డి. వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి.నెం.96- తూ॥గో॥జిల్లా

వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం

బహిరంగ వేలం ప్రకటన

తూ॥గో॥జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో గల డి.వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు ఈ దిగువ తెలిపిన బకాయిదారులు [illegible] వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం [illegible] ది.20.01.2023 [illegible] జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏలూరు. వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం [illegible] బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు వేలము పాటలో పాల్గొనవచ్చును.

వ.నెం.	ఇ.పి.నెం.	బాకీదారు పేరు	ఆస్తి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం (యఁ.సెం)	సరిహద్దులు	చెల్లించవలసిన మొత్తం రూపాయలు	వేలం తేదీ, సమయము, స్థలం
1.	1976/20-21	[illegible]	[illegible]	255-2 255-4 254-2	0-85	కలవు	రూ.4,47,151/- (-) తదుపరి బాయిదాలు తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.20-01-2023 ఉదయం 11.00లకు, వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
2.	1977/20-21	[illegible]	[illegible]	255-2 255-4	0-35	కలవు	రూ.4,49,200/- (-) తదుపరి బాయిదాలు తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.20-01-2023 ఉదయం 11.30లకు, వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
3.	1978/20-21	[illegible]	[illegible]	254-2	0-85	కలవు	రూ.4,65,267/- (-) తదుపరి బాయిదాలు తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.20-01-2023 మధ్యాహ్నం 12.00లకు, వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
4	1982/20-21	[illegible]	[illegible]	56-6 56-7	0-80	కలవు	రూ.3,98,508/- (-) తదుపరి బాయిదాలు తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.20-01-2023 మధ్యాహ్నం 12.30లకు, వేలివెన్ను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం

సూచనలు : 1. వేలములో పాల్గొనదలచిన వారు వేలము అధికారి వద్ద రూ.10,000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. [illegible] 15% [illegible] 15 రోజులలో పూర్తిగా చెల్లించవలెను. [illegible]

బసవా సత్యనారాయణ

సేల్ ఆఫీసర్ / బ్రాంచి మేనేజరు

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లి. ఏలూరు, [illegible]

స్థలము : వేలివెన్ను

తేది: 16-01-2023